క్లుప్తంగా

పల్లెకోనలో క్లీన్ అండ్ గ్రీన్



పల్లెకోన(భట్టిప్రోలు): బాపట్ల జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్ సూచనల మేరకు గురువారం భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామ పంచాయతీ పరిధిలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు రాయన ప్రసాద్, మండవ రామకోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరపతయ్యలు గ్రామంలో చెత్తను ఊడ్చారు. గ్రామంలో ఇంటింటి నుంచి చెత్త సేకరణ వంద శాతం జరగాలని వారు పేర్కొన్నారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు వద్దు... జూట్ బ్యాగ్‌లు ముద్దు అంటూ ప్రజా ప్రతినిధులు గ్రామంలో నినాదాలు చేశారు.

ఘనంగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతి



చెరుకుపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఏకాత్మత మానవత దర్శనం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ జయంతిని గుళ్ళపల్లిలో బీజేపీ నాయకులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మండలంలోని పొన్నపల్లి అగ్రహారంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంపల్లి జగనాథ శాస్త్రి, పొన్నపల్లి సత్యనారాయణ, కందుల శివ శంకర్, మల్లెల కృష్ణమూర్తి, యు.శివరామకృష్ణ, దామర్ల చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

భట్టిప్రోలు: హార్వెస్ట్ ఇండియా వ్యవస్థాపకురాలు రెవరెండ్ లలిత కుమారి ఆశీస్సులతో అధినేత కత్తెర సురేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 27న భట్టిప్రోలు కేఎస్‌కే కళాశాల క్యాంపస్ ఆవరణలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ సౌజన్యంతో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. హాస్పిటల్ 25వ వార్షికోత్సవం సందర్భంగా అడ్మిట్ అయిన పేషెంట్లకు అల్ట్రాసౌండ్, సీటీస్కాన్, ఎంఆర్ఐ, అన్ని రక్త పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని భట్టిప్రోలు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సేవలే లక్ష్యం

కెనరా బ్యాంక్ విజయవాడ బ్రాంచ్ జీఎం విజయలక్ష్మి



చెరుకుపల్లి: మండలంలో స్వయం ఉపాధి, చిరు వ్యాపారులను ప్రోత్సహించేందుకు కెనరా బ్యాంక్ మెరుగైన సేవలందిస్తుందని విజయవాడ బ్రాంచ్ జనరల్ మేనేజర్ సి.జె.వి జయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలో నూతనంగా కెనరా బ్యాంక్ శాఖను గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, ఖాతాదారులకు సులభతరమైన.. మెరుగైన సేవలు అందించడమే కెనారా బ్యాంకు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో గుంటూరు బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ డి.రాజ్‌కుమార్, విజయవాడ బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ప్రేమ్‌రాజ్ బోయి, మండలంలోని పలువురు ప్రముఖులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం కృష్ణానది పరివాహక లంక గ్రామాల్లో ఆర్డీవో రామలక్ష్మి పర్యటించారు. ఈ సందర్భంగా పెసర్లంక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని, అలాగే భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు.

ఏటా.. తప్పని కష్టాలు



విఠలేశ్వర నగర్ కాలనీలో ఇళ్ల మధ్యలో నిలిచిన వర్షపు నీరు, మురుగు నీరు



విఠలేశ్వర నగర్ కాలనీలో నాచుతో కూడిన మురుగు నీరు

- ముంపులో భట్టిప్రోలు విఠలేశ్వర నగర్ కాలనీ
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- వర్షపు నీరు, మురుగు నీరు ఏకమై దుర్వాసన వస్తున్న వైనం
- కొద్ది రోజులుగా నీటిలోనే మగ్గుతున్న గృహాలు

భట్టిప్రోలు: అసలే వర్షాకాలం ఆపై వ్యాధులు ప్రబలడం, దీనికి తోడు వర్షాలతో గత రెండు వారాలుగా భట్టిప్రోలు విఠలేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని విఠలేశ్వర నగర్ ప్రధాన రహదారి ఇరువైపులా ముంపులో ఉంది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అసలే లోతట్టు ప్రాంతం దీనికి తోడు కాలనీ పక్కగా వెల్లటూరు చానల్ సాగు నీటి కాల్వ పారుతుండటంతో ఊట నీరు దిగి మరింత ముంపుకు గురవుతుంది. ఈ కాలనీ ఏర్పడి రెండున్నర దశాబ్దాలు కావస్తున్నా మెరకలు, సరైన రహదారులు లేకపోవడం వల్ల ఏటా కొద్దిపాటి వర్షం కురిసినా పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కావు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లోని వృధా నీరు, ఎటూ పోయే మార్గం లేక వర్షపు నీరు ఏకమై రహదారులు తటాకాలను తలపిస్తున్నాయి. సీసీ రోడ్డు వేసినా ఇరుపక్కల రహదారులు మొత్తం జలమయమయ్యాయి. కాలనీకి సమీపంలో ఉన్న పంచాయతీ చెరువుకు కాల్వ నుంచి నీరు పెట్టుకునేందుకు తూములు ఏర్పాటు చేశారు. ఈ తూముల ద్వారా సాగు నీరు చేరి కాలనీ ముంపుకు గురవుతుంది. సుమారు 200 కుటుంబాలకు పైగా ఈ కాలనీలో నివాసం ఉంటున్నాయి. గతంలో చెరువు పూడిక తీయించాలని కాలనీ వాసులు పంచాయతీకి విన్నవించుకున్నారు. అయినప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ద్విచక్ర వాహనాలు మొరాయించి మరమ్మతులకు గురవుతున్నాయి.

ఏటా వర్షాకాలంలో ఇదే తంతు

వర్షాకాలం వచ్చినప్పుడల్లా స్థానికులకు ఈ కష్టాలు తప్పడం లేదు. కనీసం కచ్చా డ్రైనేజీ వ్యవస్థ కల్పించడంలో అధికారులు శ్రద్ధ కొరవడింది. ఎన్నికల సమయంలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు చేపడతామని హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నీరు నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. పంచాయతీ అధికారులు కనీసం బ్లీచింగ్, సున్నం చల్లడం లేదని వాపోతున్నారు. పశువుల వ్యర్థాలు, చెత్త చెదారం, మురుగు నీరు ఏకమై పల్లపు ప్రాంతాల్లో వారాల తరబడి నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తుంది. కాలనీలో తాగునీటి అవసరాల కోసం పంచాయతీ ఏర్పాటు చేసిన కుళాయిలు మురుగు నీటిలో మగ్గుతున్నాయి. కాలనీలో రహదారులు సైతం నీటిలో మునిగిపోవడం వల్ల పాములు ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

నీటిని తోడేలా చూస్తాం

ఈ కాలనీ దుస్థితి తెలుసు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నిల్వ ఉన్న నీటిని తోడేలా చూస్తాం. ఇదే పరిస్థితి పంచాయతీ పరిధిలో మరో రెండు చోట్ల నెలకొంది. కాల్వలో నీటిని తగ్గించాం. మోటార్ల ద్వారా తోడిస్తే నీరు ఎటూ పోయే మార్గం లేదు.

– మాణిక్యనాయక్, ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు

పట్టణ పరిశుభ్రతను కాపాడాలి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె(చెరుకుపల్లి): పట్టణ ప్రజలు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరించే మున్సిపల్ సిబ్బందికి ఇచ్చి పట్టణ పరిశుభ్రతను కాపాడాలని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వినాయకుడి గుడి ఏరియాలోని పోలీస్ క్వార్టర్స్ వద్ద గల చెత్త పాయింట్‌ను మున్సిపల్ అధికారులు శుభ్రం చేయించి అక్కడ మహిళలతో ముగ్గులు వేయించి, చెత్తను బయట పారవేయకుండా మున్సిపల్ కార్మికులకు ఇస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ వారానికి ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమంలో పాల్గొని స్వచ్ఛ రేపల్లెకు పాటు పడి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కమిషనర్ తెలియజేశారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, పట్టణ ఆదర్శ వేదిక అధ్యక్షుడు కిషోర్ బాబు, పారిశుధ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో అంటు వ్యాధుల నివారణ

డీపీవో ప్రభాకరరావు



కర్లపాలెంలో జరిగిన పారిశుద్ధ్య కార్యక్రమంలో డీపీవో ప్రభాకరరావు

కర్లపాలెం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవటం వలన అంటు వ్యాధులను నివారించగలుగుతామని డీపీవో కేఎల్ ప్రభాకరరావు తెలిపారు. కర్లపాలెంలో గురువారం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, కర్లపాలెం పంచాయతీ సిబ్బంది కర్లపాలెం సచివాలయం నుంచి ప్రాథమిక పాఠశాల వరకు రోడ్లకి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. డీపీవో ప్రభాకరరావు మాట్లాడుతూ అన్ని పంచాయతీలలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాల్సిన బాధ్యత స్థానిక అధికారులపై ఉందని చెప్పారు. ఎంపీడీవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానిక ప్రజా ప్రతినిధులు పంచాయతీ సిబ్బంది పాల్గొని పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో కర్లపాలెం గ్రామ సర్పంచ్ నక్కా లలితకుమారి, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, కార్యదర్శి సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం.. జలమయం



కొల్లూరు పీహెచ్‌సీ ఆవరణలో చేరిన పంట కాలువ నీరు

కొల్లూరు: పరిశుభ్రమైన వాతావరణంలో రోగులకు వైద్య సేవలు అందజేయాల్సిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అపరిశుభ్ర వాతావరణంలో కునారిల్లుతుంది. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్యశాలల బాగోగుల విషయంలో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తుండటంతో పీహెచ్‌సీలలో పరిశుభ్రత లోపిస్తుంది. కొల్లూరు పీహెచ్‌సీ ఆవరణ జలమయమవడంతో వైద్యశాలకు వచ్చే రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. వైద్యశాల వెంబడి ప్రవహిస్తున్న దోనేపూడి చానల్ నుంచి వస్తున్న నీటితోపాటు, బాలుర, బాలికోన్నత పాఠశాలల క్రీడా మైదానం నుంచి నీరు వైద్యశాల ఆవరణలోకి ఉబికి వస్తుండటంతో పీహెచ్‌సీ ఆవరణ రోజుల తరబడి నీటితో నిండి ఉంది. నీటి నిలువ కారణంగా దోమలు విజృంభిస్తుండటంతోపాటు, నీటిలో పడిన చెట్ల ఆకులు, పక్షులు, ఇతర జంతువుల వ్యర్థాల కారణంగా దుర్గంధం వ్యాపిస్తుంది. వైద్యశాలలో వినియోగించిన సెలైన్ బాటిల్స్, ఇంజెక్షన్ సీసాలు వంటివి, వాహనాల టైర్లు ఉండటంతో దోమలకు ఆవాసంగా మారింది. వైద్యశాల ఆవరణ నీటి మయంగా మారడంతో 108, 104 వాహనాలు పీహెచ్‌సీ ఎదురుగా నిలపాల్సి వస్తుండటంతో రోగులు రాకపోకలు సాగించేందుకు వీలు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణం అధికారులు స్పందించి వైద్యశాల ఆవరణను మెరక చేయించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరతున్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

బాపట్ల డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ విజయమ్మ



భట్టిప్రోలు: వర్షాకాలం వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని బాపట్ల డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ అన్నారు. గురువారం ఆమె భట్టిప్రోలు పీహెచ్‌సీ వైద్యశాలను సందర్శించారు. విధుల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. పీహెచ్‌సీలోని వసతులు రోగుల నమోదు, సిబ్బంది పని తీరును పరిశీలించారు. లంక గ్రామాలైన భట్టిప్రోలు, కొల్లూరు, రేపల్లె మండలాల్లో విపత్తు వరదలు వస్తే పునరావాస కేంద్రాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. వైద్యులతో పాటు సిబ్బంది అందరూ అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామంలో ఏర్పాటు చేసిన 104 క్యాంప్‌ను సందర్శించి వైద్య సేవల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. 104 ద్వారా 14 రకాల చికిత్సలు, 105 రకాల మందులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో వైద్య శిబిరాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట బాపట్ల డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మావతి, పీహెచ్‌సీ వైద్యురాలు మొహీసీనా తాజ్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంతర కళాశాలల కబడ్డీలో బాపట్ల విద్యార్థుల ప్రతిభ




బాపట్ల: చదువుతోపాటు క్రీడాల్లోనూ బాపట్ల కళాశాల విద్యార్థులు రాణిస్తున్నారని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ నెల 21వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో అంతర కళాశాలల కబడ్డీ టోర్నమెంట్‌లో బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కళాశాలల విద్యార్థులు మొదటి రెండు బహుమతులను సాధించినందుకు గాను గురువారం వారికి అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ముప్పలనేని మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి మానం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పారేపల్లి చంద్రశేఖర్, దొడ్డపనేని వెంకయ్యచౌదరి, అధ్యాపకులు మల్లిఖార్జున రావు, ఎం.రామారావు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టిన అధికారులు



అమర్తలూరు(వేమూరు): పరిశుభ్రత పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీవో మారుతి శేషాంబ అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ కార్యక్రమంలో భాగంగా గురువారం శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామం శుభ్రతకు ప్రతి ఒక్కరూ శ్రమదానం చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.




సత్యవతీపేటలో కాత్యాయనీగా...



వలివేరులో చండి యాగం



చినపరిమి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో...



రామచౌడేశ్వరస్వామి దేవాలయంలో...

వైభవంగా దసరా శరన్నవరాత్రి వేడుకలు

దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. బాపట్ల, వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ఉన్న ఆలయాల్లో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం పలు ఆలయాల్లో అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పిట్టలవానిపాలెం(కర్లపాలెం)/చుండూరు(వేమూరు)/కొల్లూరు/వేమూరు/భట్టిప్రోలు/రేపల్లె (చెరుకుపల్లి)



కోటిపల్లి సోమశేఖరాలయంలో...



చందోలులో ప్రత్యేక అలంకారంలో...



చావలి వాలేశ్వర దేవస్థానంలో...



అబ్బనగూడవల్లి శివాలయంలో...



చెన్నుమల్లేశ్వరస్వామి ఆలయంలో...



భట్టిప్రోలు వాసవి దేవాలయంలో...

రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించాలి

బాపట్ల ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ హుస్సేన్



అద్దేపల్లి(భట్టిప్రోలు): విషతుల్యం కాని ఆహార పదార్థాలను పండించేందుకు రైతులు సేంద్రియ ఎరువులు ఉపయోగించాలని బాపట్ల ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సయ్యద్ అక్తర్ హుస్సేన్ పేర్కొన్నారు. భట్టిప్రోలు పరిధిలోని అద్దేపల్లిలో తోకల జాన్ ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ కేంద్రంను ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హుస్సేన్ మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతం వంటి కషాయాలను వినియోగించాలని కోరారు. రసాయన ఎరువులు తగ్గించి రైతులు సేంద్రియ ఎరువులు వినియోగించాలని చెప్పారు. గ్రామంలో గ్రోత్ ప్రమోటర్స్‌తో రైతులు ప్రకృతి వ్యవసాయం నిర్వహిస్తున్నారు. దుకాణంలో బయో ఇన్‌పుట్ విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఏవో బి.బ్రహ్మారెడ్డి, తూనుగుంట్ల సాయిబాబా, ఎంటీ ఎస్.ప్రకాష్ కుమార్, యూనిట్ ఇన్‌చార్జిలు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

ఎస్పీ ఆకస్మిక తనిఖీలు

వెదుళ్ళపల్లి, సీసీఎస్, డాగ్ స్క్వాడ్‌ల తనిఖీ



వెదుళ్ళపల్లి పోలీస్‌స్టేషన్ పరిసరాలను తనిఖీ చేస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల టౌన్: జిల్లాలోని వెదుళ్ళపల్లి పోలీస్‌స్టేషన్, సీసీఎస్ పోలీస్ స్టేషన్, పోలీస్ డాగ్ స్క్వాడ్ కార్యాలయాలను గురువారం సాయంత్రం జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నేరాలను అరికట్టడంలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమని, ప్రతి ఒక్కరు దీనిని అందిపుచ్చుకోవాలన్నారు. స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వారి కదలికలపై నిఘా పెంచాలన్నారు. యువతను మత్తు పదార్థాలకు బానిసలుగా చేసి వారి భవిష్యత్తును అంధకారంగా మార్చే గంజాయి వంటి పదార్థాల విక్రయాలను కట్టడి చేసి యువతలో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం పోలీస్ డాగ్ స్క్వాడ్ భవనంలోని డాగ్ కెన్నెల్స్‌ను, జాగిలాలకు ఇచ్చే ఆహారాన్ని, వాటి శిక్షణ తదితర అంశాలను పరిశీలించారు. కార్యక్రమంలో బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు, ఎస్బీ సీఐ జి.నారాయణ, బాపట్ల రూరల్ సర్కిల్ సీఐ బి.హరికృష్ణ, వెదుళ్లపల్లి ఎస్ఐ పి.భాగ్యరాజ్ పాల్గొన్నారు.

కాలువలో దూకి వృద్ధుడు ఆత్మహత్య



బాపట్లటౌన్: కాలువలో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నందిరాజుతోట గ్రామంలో చోటు చేసుకుంది. నందిరాజుతోట గ్రామానికి చెందిన జవ్వాది వీరభద్రరావు అలియాస్ భద్రయ్య (62) గ్రామంలో కిరణా కొట్టు నడుపుకుంటూ ఒంటరిగా జీవిస్తుంటాడు. జీవితం మీద విసుగు చెంది మూడు రోజుల క్రితం తన టీవీఎస్ ఎక్సల్ వాహనంపై నాగరాజు కాలువ వద్దకు చేరుకొని ద్విచక్ర వాహనాన్ని బ్రిడ్జిపై పెట్టి కాలువలో దూకాడు. మూడు రోజుల తర్వాత గురువారం ఉదయం మృతదేహం సూర్యలంక తీరానికి కొట్టుకు వచ్చింది. ఈ మేరకు రూరల్ సీఐ కె.శ్రీనివాసరావు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.